"నీకన్నా మూర్ఖుడు నీకు తారస పడినప్పుడు ఇది అతనికి ఇవ్వు."

కొన్ని నెలలు గడిచాయి. ఓ రాత్రి ఆ ధనికుడి ఇంట్లో దొంగలు పడి వున్నదంతా దోచుకెళ్ళారు. అడ్డుపడ్డ ఆ ధనికుడి కాళ్ళని విరగ్గొట్టారు. కాళ్ళు లేక కదలలేని స్థితిలోని ఆ దరిద్రుడికి సపర్యలు చేయలేక భార్య, పిల్లలు అతన్ని వదిలి వెళ్ళిపోయారు.

తన యజమానికి కలిగిన దుస్థితి గురించి తెలిసి ఆ నౌకరు ఆయన దగ్గరకి వచ్చాడు.

"గుర్తుందా?నా కన్నా మూర్ఖుడు మీకు ఈ లోకంలో తారసపడితే వాడికి ఇవ్వమని ఓ బొమ్మని ఇచ్చారు నాకు? ఇప్పుడు నాకు అలాంటి మూర్ఖుడు తారసపడ్డాడు."

తన చేతిలోని ఆట బొమ్మని ఆ నౌకరు తన యజమాని చేతిలో వుంచాడు.

"నేనెలా మూర్ఖుడ్ని అయానో కూడా చెప్పు." అడిగాడాయన.

"మీరు లెక్క పెట్టే డబ్బుని నేను గులకరాళ్ళు అంటే మీరు నమ్మలేదు. ఇప్పుడు మిమ్మల్ని ఈ స్థితికి తీసుకువచ్చిన అలాంటి డబ్బుని ప్రేమించిన మీరు మూర్ఖుడు కాదా? అలాగే డబ్బున్నంత కాలం మీ వాళ్ళు అనుకుని మీరు ప్రేమించిన మీ భార్యా పిల్లలు ఆ డబ్బు పోయాక మిమ్మల్ని వదిలి వెళ్ళిపోయారు కదా. వాళ్ళని మీ శత్రువులుగా గుర్తించక ప్రేమించిన మీరు మూర్ఖులు కాదా?"

ఆ యజమానికి తన తప్పు తెలిసివచ్చింది.

"మరి నా భార్య పిల్లల్ని కాక ఎవర్ని ప్రేమించాలి?" అడిగాడాయన.

"భగవంతుడ్ని. మీరు ధనవంతుడైనా, దరిద్రుడైనా; ఆరోగ్యంగా వున్నా, అవకరం కలిగివున్నా తనని ప్రేమించేవారిని ఆయన తిరిగి ప్రేమిస్తాడు."

ఆ యజమానిని దైవ భక్తుడైన ఆ నౌకరు ఆదుకున్నాడు.

## 114. పర్‌ఫెక్షన్

ఓ ధనికుడు తన ఆరేళ్ళ కొడుకుని మానసిక వికలాంగులకి విద్య నేర్పే స్కూల్లో చేర్పించడానికి తీసుకువచ్చాడు. ఆ రాత్రి కొత్త విద్యార్థుల తల్లితండ్రులకి

ఆ స్కూలు వారు ఏర్పాటు చేసిన డిన్నర్‌కి హాజరయ్యాడు. అందర్నీ తలో నిముషం మాట్లాడమని హెడ్ మాస్టారు కోరాడు. అంతా ఆ స్కూలు సేవలని కొనియాడారు. ఆ ధనవంతుడి దగ్గరకి కార్డ్‌లెస్ మైక్ వచ్చింది. అతను లేచి ఇలా చెప్పాడు.

"ఇక్కడ హనుమంతుడి ఫొటో, శ్రీకృష్ణుడి ఫొటో, వెంకటేశ్వరస్వామి ఫొటోలు గోడలకి వుంచారు. బావుంది. కాని దేవుళ్ళల్లో పర్‌ఫెక్షన్ అనేది అసలు వుందా అని నా ప్రశ్న. ఉంటే మరి మిగిలిన పిల్లలంతా మామూలు పాఠశాలలకి వెళ్ళి టీచర్ చెప్పింది వెంటనే అర్థం చేసుకోగలుగుతున్నారు. నా కొడుకో? నిపుణులైన టీచర్ అనేక విధాలుగా బోధిస్తే కాని అర్థం చేసుకోలేడు."

అంతా నిర్ఘాంతపోయి ఆయన వంక చూసారు.

ఆయన సన్నగా నవ్వి మళ్ళీ తన ప్రశ్నకి తనే జవాబు చెప్పాడు.

"ఆయనలోని పర్‌ఫెక్షన్ వల్లే దేవుడు ప్రపంచంలోకి ఇలాంటి పిల్లల్ని తీసుకువస్తాడని నా నమ్మకం. మిగిలినవాళ్ళు ఎంత పర్‌ఫెక్ట్? ఇలాంటి పిల్లల్ని చూసి వారు ఎలా రియాక్ట్ అవుతారు అన్న విషయం తెలుసుకోవాలని దేవుడు మానసిక వికలాంగులని ఈ ప్రపంచంలోకి ప్రవేశపెడతాడని నా గాఢ నమ్మకం."

## 115. ప్రవచనం ఎలా వుండాలి?

ఓ గురువుకి ఒంట్లో బాగా లేకపోవడంతో అతని శిష్యుడు ఆ రోజు ఆయన బదులుగా ప్రవచనం చెప్పాల్సి వచ్చింది. అతను రాసుకున్న ప్రవచనం కాగితాన్ని గురువుకి ఇచ్చి అడిగాడు.

"ఏమైనా మార్పులు, చేర్పులు సూచిస్తారా?"

దాన్ని గురువు ఆసాంతం చదివి చెప్పాడు.

"ఇదేం ప్రవచనం? దీంట్లో వర్ణనలు తప్ప అసలు ఉండాల్సిన ఆధ్యాత్మికతే లేదు."

"రామాయణంలో సుందర కాండలోని వానరులు సంచరించే అడవుల్లోని ప్రకృతి దృశ్యాల వర్ణన గురించి కదా నేను చెప్పేది. రామాయణంలో ఆధ్యాత్మికత లేదంటారా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు శిష్యుడు.